# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర



*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# పరుగు!!

చెన్నై మహానగరంలో అమెరికా కాన్సులేట్ దగ్గరలో ఉన్న హోటల్ ' ది పార్క్'. వచ్చే పోయే వారితో హోటల్ లాబీ అంతా సందడిగా ఉంది. దానికి తోడు కింద అంతస్థులో ఏదో ఎక్జిబిషన్ కూడా జరుగుతోంది. అదో సందడి.

ఎంబసీలో వేలుముద్రల కార్యక్రమం ముగించుకుని, రేపు జరగబోయే తమ ఇంటర్వ్యూ గురించి మాట్లాడుకుంటూ లోపలకి అడుగుపెట్టారు శివానీ, దీపక్. దీపక్ కి మూడేళ్ళపాటు అమెరికాలో క్లయింట్ ఆఫీసులో పని చెయ్యడానికి, అతనికిచ్చే వీసా కేవలం చెన్నై ఎంబసీలో మాత్రమే ఇస్తారు కనక హైద్రాబాద్ నుంచి వారిక్కడిక్కడికి రావలసి వచ్చింది.

ఆగి ఉన్న లిఫ్ట్ లో ఎక్కారు ఇద్దరూ.. తలుపు మూసుకోబోతుంటే వచ్చారా ఇద్దరు వ్యక్తులు.. ఒక పెద్దాయన, అరవై పైనుంటుందేమో అతని వయసు.. పక్కనే ఒక చేతిలో కోటూ, మరో చేతిలో మంచి లెదర్ బాగ్ పట్టుకుని ఉన్న ఒక యువకుడూ..

లిఫ్ట్ తలుపులు మూసుకున్నాయి.. ఆ పెద్దాయనని ఎక్కడో చూసినట్టనిపించింది శివానీకి. తెల్లగా ఉన్నాడాయన. బట్టతల, నెరిసిన గడ్డం, ఎర్రగా ఉన్న కళ్ళు. జాగింగ్ పేంట్ లాంటిది వేసుకుని, పైన నల్ల టీ షర్ట్. దాని మీద పైకి కనిపిస్తున్న వెడల్పాటి బెల్ట్.

నడుం నొప్పేమో అనుకుంది.. అతను తనకి బాగా పరిచయం ఉన్న వ్యక్తిలా అనిపించడంతో, అతన్నే చూడసాగింది మరో రెండు క్షణాలసేపు..

అంతలో గుర్తొచ్చినట్టుగా.. ఒక్కసారిగా పెద్దగా..

" అంకుల్, ఐ మీన్ సర్, మీరు నీరజ్ అగర్వాల్ గారు కదూ? “సంశయంగా అడిగింది శివాని.

" అవును, మీరు?" అన్నాడాయన ఆమె ముఖంలో తెలిసిన పోలికలేమైనా కనబడతాయేమోనని..

" మీరు ఒకప్పుడు హైదరాబాద్ లో ఉండేవారు కదూ!? " అంది..

" అవునమ్మా! మీరు, నువ్వు... ఐ మీన్ శివానీవి కదూ?!" అన్నాడాయన సంబరంగా. ఆమెను గుర్తు పడుతూ..

ఒక్కసారిగా వచ్చిన వెయ్యి ఓల్టుల వెలుగు ఆయన ముఖంలో..తెల్లటి ఆయన ముఖం సంభ్రమాశ్చర్యాలతో గులాబీ రంగులోకి మారింది..

" ఓ మై గాడ్! భలే గుర్తు పట్టారే??!! ఎలా?" అంది సంబరంగా ఆయన చెయ్యి పట్టుకుంటూ.

" మా ఇంట్లో పెరిగిన పిల్లని నేను ఆ మాత్రం గుర్తుపట్టలేనూ! ఎలా అడుగుతోందో చూడు! అన్నాడాయన ఆమె తల మీద చిన్నగా తడుతూ..

" నువ్వేమిటి ఇక్కడ? ఇతను?" అంటూ దీపక్ వైపు చూశాడు..

" దీపక్, మై హజ్బెండ్!. వీసా పని మీద వచ్చాము" అంది శివాని.

. " దీపూ, మా నీరజ్ అంకుల్ అని చెప్తూ ఉంటాను కదా, ఈయనే!" అంది ఆనందంగా..

" నమస్తే! అన్నాడు దీపక్ వారిద్దరినే చూస్తూ..

" నువ్వు నన్ను మర్చిపోలేదన్నమాట. థాంక్స్ రా తల్లీ!' అన్నాడాయన..

"మర్చిపోవడమా, భలేవారే! మా నీరజ్ ఉంకుల్ ఇలా, మా ఆరతీ ఆంటీ అలా అంటూ ఎన్ని కబుర్లు విన్నానో ఈ నాలుగేళ్ళల్లో. ఇన్నాళ్లకి మిమ్మల్ని చూడగలిగాను" అన్నాడు దీపక్ కూడా చనువుగా ఆయనతో కరచాలనం చేస్తూ..

" ఇన్నాళ్ళూ బొంబాయిలోనే ఉన్నారా? మరెప్పుడూ ఎందుకు కలవలేదు? ఫోన్ చెయ్యలేదు? నాన్న చాలా సార్లు ప్రయత్నించారు. కనీసం నా పెళ్ళికైనా మిమ్మల్ని, ఆంటీని పిలవాలని" అంది శివాని చిరుకోపంతో..

" ఐనో, ఐనో" అన్నాడాయన నెమ్మదిగా. ఉబ్బినట్టు కనిపిస్తున్న ఆయన ముఖంలో ఆనందం ప్రతిఫలిస్తోంది..

" మీ పని అయిందా, లేదా? అయిపోతే ఇక్కడెందుకు? పదండి నా గదికెళ్ళి మాట్లాడుకుందాం" అంటూ లిఫ్ట్ దిగాడాయన. ఆయన వెనకే ఆయన చేతి బాగ్, కోట్ అవీ పట్టుకుని ఉన్న అతను కూడా.

సరాసరి అందరూ ఆయన రూములోకి నడిచారు. అది రెండు గదులున్న సూట్.

లోపలకి అడుగుపెట్టగానే ఆయన నడుముకి పెట్టుకున్న బెల్ట్ వదులు చేసుకుని విశాలంగా ఉన్న మంచం మీద రెండు మూడు తలగడల సపోర్ట్ తో పడుకున్నాడు..

" ఎక్కువసేపు నిలబడడం, నడవడం నా వల్ల కాదు. నడుము నన్ను సతాయిస్తుంది.. ఐ యాం సారీ ‘ " అంటూ..

‘మీరిద్దరూ కూర్చోండి ‘అన్నాడు..

శివాని, దీపక్ లిద్దరూ పక్కనే ఉన్న సోఫాలో కూర్చున్నారు..

“ నడుం నొప్పా అంకుల్!?" అంది శివాని బాధగా

" అది ఒక్కటే అయితే పరవాలేదు" అన్నాడాయన నవ్వుతూ.

ముందుగదిలో కోటు, సూట్ కేస్ అవీ సర్దుతున్న అతన్ని పిలిచి " శంకర్! ఆకలేస్తోంది, అర్జెంట్ గా కాఫీ, ఏవైనా స్నాక్స్ చెప్పు" అన్నాడు..

శంకర్ తన యజమానివైపు చిత్రంగా చూస్తూ " ఓ కే సార్" అంటూ వెళ్ళిపోయాడు.

" ఇప్పుడు చెప్పండి అంకుల్! ఎలా ఉన్నారు? ఈ బెల్ట్ ఏమిటి? హెల్త్ బాగోలేదా? ఇలా అయిపోరేం?" అంది ఆత్రంగా శివాని..

అన్ని ప్రశ్నలకీ చిన్నగా నవ్వాడాయన.

ఆమె కళ్ళల్లో ఇంకా పాతకాలపు నీరజ్ రూపం కదలాడుతోంది. ఎప్పుడూ మడత నలగని బట్టలు, ముట్టుకుంటే మాసిపోతారేమోననిపించేంత తెల్లటి రంగు, వత్తైన జుట్టూ, తీర్చిదిద్దినట్టుగా ఉండే ముఖం.. తమ కాలనీలో నీరజ్ అంకుల్ అంటే ఓ హీరో! ఆయనకి సరిజోడీ ఆరతీ ఆంటీ!

అప్పుడే ఉద్యోగం మానేసి స్వంతంగా వ్యాపారం మొదలుపెట్టిన వాడు. ఎంత చార్మింగ్ గా ఉండేవారు? అప్పటి ఆ అంకుల్ కి, ఇప్పటి ఈ రూపానికి కాస్తైనా పొంతన లేదే? వయసు ఎవ్వరినైనా విరుస్తుందా? లేదా ఇంకేదైనా కారణమా?

వంగినట్టుగా ఉన్న రూపం, మెరుస్తున్న బట్టతల. పెరిగిన పొట్ట. కళ్ళ కిందా, బుగ్గలూ బాగా ఉబ్బడం వల్ల వాచినట్టుగా కనబడుతున్న ముఖం.. నడుముకి పెట్టుకున్న బెల్ట్..ఎన్నో సంవత్సరాలు మీద పడినట్టున్న అతన్ని చూస్తే శివాని మనసు బాధతో మూలిగింది.

“నా సంగతి సరే, నువ్వు చెప్పు! ఏం చదివావు? ఎలా ఉన్నావు? మా అబ్బాయి, అదే దీపక్ తో పెళ్ళయ్యి ఎన్నాళ్ళు? మీ నాన్న ఎలా ఉన్నాడు? నన్నెప్పుడైనా గుర్తు చేసుకుంటాడా?లేక ఈ నీరజ్ అగర్వాల్ ని మర్చిపోయాడా?” అంటూ ప్రశ్నలు వేశాడు..

తను తొమ్మిదో క్లాస్ లో ఉండగా వాళ్ళు హైదరాబాద్ వదిలి వెళ్ళిపోయినప్పటినించీ, నాలుగేళ్ళ క్రితం దీపక్ తో జరిగిన తన పెళ్ళిదాకా అన్ని విషయాలు పూస గుచ్చినట్టు వివరంగా చెప్పింది. ఎంతకీ తెగని ప్రవాహంలా సాగుతున్న వీళ్ళిద్దరి మాటలనీ ప్రేక్షకుడిలా చూస్తున్నాడు.

" బావుందమ్మా, నువ్వు,  అన్నయ్య శివ ఇద్దరూ హైదరాబాదేనన్నమాట. మీ నాన్నకేం? కులాసాయే కదూ ఇంక!"  అన్నాడు నవ్వుతూ..

" ఇప్పుడే నేను వెళ్ళిపోతానని బెంగ పెట్టుకుంటున్నారు అమ్మా, నాన్నా!  అంటూ, మీకు మాత్రం కులాసాకేం లోటొచ్చింది? ఆంటీ ఎలా ఉన్నారు? ఇప్పుడు వివరాలు చెప్పడం మీ వంతు" అంది..

" నీకు గుర్తుందా! నీ చిన్నప్పుడు ఒక సారి దెబ్బ తగిలి పడిపోయావు, తల మీద మూడు కుట్లు పడ్డాయి" అంటూ అతనేదో చెప్తూ ఉండగానే వెయిటర్ తో పాటు శంకర్ కూడా వచ్చాడు స్నాక్స్ టీ కాఫీలతో..

" ఇవి చాలవు శంకర్, నాకు బాగా ఆకలిగా ఉంది, మరో రెండు ప్లేట్స్ బజ్జీలు, సాండ్ విచ్ లు అవీ చెప్పు. అలాగే ఐస్ క్రీం కూడా. మరో గంట వరకూ కాల్స్, మెయిల్స్ నువ్వు చెక్ చెయ్యి. మరీ ముఖ్యమైనవైతేనే నాకు చెప్పు! ఆ తర్వాత చూద్దాం, ఏం చెయ్యాలో?"అన్నాడు మంచం మీద నెమ్మదిగా లేచి కూర్చుంటూ.

మంచం మీద లేచి కూర్చునే ప్రయత్నంలో అతను పడిన కష్టం చూస్తే శివానీకే కాదు,  దీపక్ కి కూడా బాధనిపించింది.

ఏదీ తినడానికి ఆసక్తి చూపని తన బాస్ నీ, అతనిలో కొత్తగా వచ్చిన ఉత్సాహాన్నీ చూస్తుండిపోయాడు శంకర్.

శివాని అడిగిన ప్రశ్నలకి సమాధానం ఇవ్వకుండా తప్పిస్తూ మాట మారుస్తున్నాడని గమనించింది దీపక్ ఒక్కడే.

ఎందుకో అతనికి తన గురించి చెప్పడం ఇష్టం లేదేమో? లేదా తనుండగా చెప్పడానికి ఇష్టపడటం లేదా? వాళ్ళిద్దరే ఉంటే శివానికి చెప్తారేమో అనుకుంటూ...

" ఒక ముఖ్యమైన కాల్ ఉంది, ఇప్పుడే వస్తాను" అంటూ ఆ గది వదిలి బయట పడ్డాడు దీపక్.

రెండు రూములకి మధ్యనున్న తలుపు వేసి శంకర్ కూడా బయటకి నడిచాడు.

“ ఇప్పుడు చెప్పండి, మీ వివరాలు, విషయాలు” నవ్వుతూ అంది శివాని..

మాట్లాడలేదు నీరజ్.. అతని కళ్ళల్లో కనిపించని కథల నీడలు..

“ఆంటీ ఎలా ఉన్నారు? ఎక్కడున్నారు మీరు? బొంబాయి లోనేనా? “అంటూ ప్రశ్నలు వేసింది..

“చెప్పండి అంకుల్! ఇన్నేళ్ళ తర్వాత కలిసి ఏం మాట్లాడరేం? నాకైతే ఎంత సంతోషంగా ఉందో తెలుసా? ఆంటీని ఇప్పుడే చూడాలని ఉంది’  అంటూ మంచం మీద అతని పక్కన చేరి చనువుగా అతని భుజం పట్టి ఊపబోయిన ఆమె అతని కళ్ళల్లో తడి చూసి ఆగిపోయింది..

" అంకుల్ ఆర్ యూ ఓకే? వాట్ హేపెండ్?" అంది ఆత్రుతగా..

" నథింగ్, బేటా.. జస్ట్ నథింగ్ హేపెండ్.. అదే నా బాధ. గత  ఐదేళ్ళుగా  ఏదైనా అవుతుందేమోననే ఎదురుచూస్తున్నాను.. మంచైనా, చెడైనా. ఏదీ అవ్వడం లేదు" అన్నాడు నెమ్మదిగా..

" అంటే!?" అర్థం కాక అడిగింది. ఆమె మనసులో మెదులుతున్న ఎన్నో సందేహాలు.

" ఏమీ లేదురా! బొంబాయైతే బిజినెస్ బావుంటుంది, మా బంధువులందరికీ దగ్గరగా ఉంటుంది అని మేము పదిహేనేళ్ళ క్రితం హైదరాబాద్ వదిలి వెళ్ళామా? బిజినెస్ బాగా పెరిగింది. అప్పట్లో నేనూ, మీ ఆంటీ, ఇంకో స్నేహితుడు మనోజ్ తో ప్రారంభమైన నా కంపెనీ ఈ పదిహేనేళ్ళల్లో ఎంతో ఎదిగింది. అది తప్ప జీవితంలో చెప్పుకోవడానికేమీ లేనంతగా.." అన్నాడు.. అతని గొంతులో ఏదో తెలియని బాధ.. అతని చేతిని తన చేత్తో గట్టిగా పట్టుకుంది.

“మీ నాన్నా, నేనూ ఒకే సారి  ఉద్యోగాల్లో చేరాము. వాడు నాకంటే కొద్దిగా పెద్దవాడు, ఉద్యోగంలో చేరేనాటికే మీ అన్నయ్య పుట్టాడు. మా పెళ్ళి అయిన రెండేళ్ళకి నువ్వు పుట్టావు. మొదటినించీ పిల్లలంటే ప్రాణంగా ఉండే ఆరతి నిన్నొక్క క్షణం వదిలేది కాదు. అప్పుడు

మనందరం కంపెనీ ఇచ్చిన క్వార్టర్స్ లోనే ఉండేవాళ్ళం కదా.. పొద్దున్నే నీ స్నానం అయ్యే టైముకి మీ ఇంటికి వచ్చేసేది తను, నిన్ను మా ఇంటికి తీసుకొచ్చి సాయంత్రం దాకా, ఆడించి, పాలు పట్టి, నిద్ర పుచ్చి, ఇలా రోజంతా నీతోనే గడిపేది ఇంచుమించుగా.

నువ్వు పెద్దయ్యాకా కూడా నిన్నెలా చూసుకునేదో నీకు గుర్తుందిగా 'అన్నాడు ఆయన.

మౌనంగా తల ఊపింది శివాని.. వాళ్ళున్నన్నాళ్ళూ తను వాళ్ళింటి పిల్లగానే పెరిగింది.

"అలాంటి ఆరతి తనకి పిల్లలు కావాలని ఎదురుచూడదండం చాలా సహజం కదా! మొదట్లో ఊరుకున్నా, ఆ తర్వాత తనకి ఆ కోరిక బలమై రాను, రాను దిగులుగా మారింది. ఎప్పుడూ పిల్లల గురించే ఆలోచిస్తూ, బాధ పడుతూ ఉండేది. నేను అదెప్పుడూ పెద్ద విషయంగా అనుకోలేదు. ముందో, వెనకో ఇంచుమించు అందరికీ పిల్లలుంటారనీ, దీనికి అంత దిగులెందుకనీ, ఇలా సర్ది చెప్పేవాడిని.

మూడ్ బావున్నప్పుడు " శివాని మన పిల్ల కాదా! కంటేనే పిల్లలా?" అనేది.

మరొకప్పుడు "నాకు మీరు, మీకు నేను చాలదా? అనేది". లేనప్పుడు విపరీతంగా దిగులు పడి అనారోగ్యాన్ని తెచ్చుకునేది..

నేను ఉద్యోగం మానేసి వ్యాపారం మొదలు పెట్టాక, బొంబాయి వెళ్ళిపోదామనుకోవడానికి మరో ముఖ్య కారణం. ఎక్కువ వైద్య సౌకర్యాలున్న ఆ నగరంలో మాకేదైనా మంచి జరుగుతుందన్న ఆశ కూడా.. కానీ, ఆ ఆశ కూడా నెరవేరలేదు.

ఎందుకో ఆమెకి పిల్లలని పెంచుకోవడం మీద, ఇతర ఆధునిక పద్ధతులమీద సదభిప్రాయం లేదు. అందుకని నేనెప్పుడు ఆ సలహా చెప్పబోయినా వద్దనేది.. గట్టిగా వాదించేది నాతో.. ఇవన్నీ ఆమెలో పెరుగుతున్న మానసిక అసంతులనం అని మాకప్పుడు తెలియలేదు.

"జీవితంలో అన్నీ అందరికీ దొరకాలని లేదు కదా, దక్కిన వాటిని జాగ్రత్త చేసుకుంటూ సంతోషం గా ఉందాం!" అనేవాడిని నేను.

ఆమెకలా ఉండేది కాదు. స్నేహితులు,బంధువులు ఎవరిని కలిసినా మొదటగా అదే ప్రస్తావన వచ్చేది, అది ఆమెని మరింత బాధ పెట్టేది. ముఖ్యంగా ఆమె పట్ల నా స్వంత అక్కల ప్రవర్తన ఆమెని చాలా గాయపరిచేది. మన సమాజంలో ఎన్నాళ్ళుగానో పేరుకుపోయిన నమ్మకాలు, ఆచారాలు..

నా పనులు, వ్యాపారాన్నిపెంచే ఆలోచనల్లో నాకంతగా తెలిసేది కాదు కానీ ఎప్పుడూ ఇంట్లో ఒంటరిగా ఉండడం చేత ఆరతి తెలియకుండానే నెమ్మదిగా డిప్రెషన్ కి లోనవసాగింది. దాన్ని ఆ పేరుతో పిలుస్తారని కానీ, ఆ లక్షణాలు ఫలానా విధంగా ఉంటాయని కానీ మాకు తెలీదు అప్పట్లో..

తెలికయే ఆరతి ఎప్పుడైనా గొడవ పెడితే నేను తనని సముదాయించేది పోయి తనతో సమానంగా అరిచేవాడిని. నిజానికి నాకు అప్పట్లో మరే మార్గమూ తోచేది కాదు. ఆమెనెలా హాండిల్ చెయ్యాలో అర్ధం అయ్యేది కాదు.

ఈ రకమైన కారణాల వల్లే మేమిద్దరం మా చుట్టూ ఒక గిరి గీసేసుకుని అందులోనే ఉండి పోయాము. ముఖ్యం గా ఆరతి.. ఎవరినీ కలవడానికి ఇష్టపడేది కాదు.

నేను నా పనుల్లో తల మునకలవుతూ ఉండగా ఆమె నాకు తెలియని ప్రపంచంలోకి వెళ్ళిపోయింది. మొదట్లో మాతో కంపెనీ పనుల్లో పాలు పంచుకునే తను మెల్లగా వాటికి దూరమయింది. ఒకరోజు నిద్రలోనే!!" అంటూ ఆగిపోయాడు మరింక చెప్పలేనట్టు..

" ఓ మై గాడ్! నిజమా? ఆరతి ఆంటీ లేదా?" అంది శివాని కళ్ళ నిండా నీళ్ళు. వాటినిండా ఆంటీ జ్ఞాపకాలు.

కొన్ని క్షణాలు ఒకరి చేతులొకరు పట్టుకుని ఉండిపోయారిద్దరూ..

"ఆరతి అనుభవించిన వేదనెంత భయంకరమో ఆమె దూరమయిన తర్వాతే నా కర్ధం అయింది బేటా!

అదివరకు ఇంటికొస్తే కనీసం అరవడానికో, పోట్లాడడానికో, అన్నీ బావుంటే మాట్లాడడానికో ఒక మనిషి ఉండేది. తనే లేకపోయాకా ఇదంతా ఎవరికోసం? ఏం సాధించాలని? ఇలా ఎన్నాళ్ళు? లాంటి ప్రశ్న లెన్నో రోజూ నన్ను వేధించేవి.

తను లేని ఈ ఐదేళ్ళల్లో ఎన్నో సార్లు ఈ జీవితం ఎందుకు? రోజుకి ఇరవై నాలుగు గంటలెందుకు? ఈ కాలం కదలదేం? ఈ కాయం మరో లోకానికి కదలదేం? అనిపించేది. రోజుకి నాలుగైదు గంటల విరామాన్ని కూడా భరించలేనంతగా బాధించేది కాలం.

ఈ ప్రశ్నలకి జవాబు చెప్పుకోలేక, వాటినించి పారిపోలేకే కదా ఆరతి నాకు దూరమయింది అనుకున్నప్పుడల్లా ఏదో తెలియని ఆవేశం, బాధ నాలో వెల్లువెత్తి, ఒకలాంటి రెస్ట్ లెస్ నెస్ కి లోనయ్యేవాడిని.

అంతలోనే మనసులో ఎక్కడో మెదిలింది చిన్న హెచ్చరిక. ఆరతి తలపే కదిలించిందేమో తల్లీ! నువ్వు నమ్మినా, లేకున్నా ఇది నిజం.. నాదారిలో మరొకరు రాకూడదు అని నా ఆరతి మరీ మరీ చెప్పినట్టు అనిపించింది ఆ రోజు.. కాదు, ఆ రోజునించి ప్రతీ రోజూ చెప్తూ ఉన్నట్టే ఉంది.

అప్పటినించీ పరుగే నా జీవిత లక్ష్యం. ఆమె ఉండగా చెయ్యలేని పని ఇప్పుడు చేస్తున్నాను. మూడేళ్ళయింది ఓ చిన్న ఫౌండేషన్ పెట్టి.

ఆరతి లా వివిధ సమస్యలతో డిప్రెషన్ తో బాధపడుతున్న వారికి కౌన్సిలింగ్, ట్రీట్మెంట్ దాని ముఖ్యమైన విధులు. అంతే కాదు, అవేర్నెస్ కూడా, తెలుసుకునేలా చెయ్యడం. ఈ పనులు పదిమందిలో ఒక్కరికి ఉపయోగపడి వాళ్ళల్లో మార్పొచ్చినా అది సత్ఫలితాన్నిచ్చినట్టే అనుకుంటాను. నలుగురు కలవని నగరాల్లో ఈ సమస్య మరీ ఎక్కువట. నీకు తెలుసా ఆడవారికి తమ తోటి వారితో కబుర్లు చెప్పుకుంటే ఒత్తిడి దూర్రమవుతుండిట. నన్నడిగితే ఒక్క ఆడవారికేనా, మనుషులందరికీ వర్తిస్తుందా మాట.

వ్యాపారం, ఫౌండేషన్ లతో తీరిక లేకుండా, ఆరతి లేకుండా, పరుగాపకుండా బ్రతకడం నేర్చుకున్నాను. జీవించడం ఎప్పుడో మర్చిపోయాను కదా!..

జీవితమంతా ఏదో సాధించాలని పరుగు పెడుతూనే ఉన్నాను. ఇప్పుడు మాత్రం సాయం అందించాలనే పరుగు పెడుతున్నాను.. అలిసిపోయినా ఆపలేని పరుగిది.. ఇదే నీ నీరజ్ అంకుల్ కథ రా! అన్నాడాయాన భారంగా.. "

కొన్ని క్షణాలు ఏమీ మాట్లాడలేకపోయింది శివాని.

COMMENTS